క్లుప్తంగా

దేవీచౌక్ ఆలయానికి పోటెత్తిన భక్తులు



గోకవరంలో వెండి, బంగారు ఆభరణాల అలంకరణలో కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు కనకదుర్గమ్మకు తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు 50 కేజీల పులిహోర ప్రసాదాన్ని వితరణ చేశారు.

దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శంఖవరం: మండలంలోని సీతంపేటలో వేంచేసిన మీనాక్షి దుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జేష్ఠ మాసాన్ని పురస్కరించుకుని పండితులు అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులు భజనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రత్నగిరిపై హనుమాన్ చాలీసా పారాయణ



హనుమాన్ చాలీసా పారాయణను ప్రారంభిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: రత్నగిరి కళావేదికపై శుక్రవారం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఎన్‌టీఆర్ జిల్లా తుళ్లూరుకు చెందిన పంచముఖ ఆంజనేయస్వామి భక్త సమాజం సభ్యుడు మువ్వా రమేష్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. తొలుత కార్యక్రమాన్ని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పారాయణ ముగిశాక భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర పారాయణ



వీరభద్రునిగడ్డలో లలితా సహస్ర పారాయణ చేస్తున్న మహిళా భక్తులు

గోకవరం: స్థానిక వీరభద్రునిగడ్డలో ఆర్యవైశ్య మహిళలు చేపట్టిన సామూహిక లలితా సహస్ర పారాయణ శుక్రవారం ఎనిమిదో రోజూ కొనసాగింది. వర్షాలు సకాలంలో పడి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు 11 రోజుల పాటు లలితా సహస్ర పారాయణ చేపట్టారు. ఎనిమిదో రోజు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పారాయణ చేశారు. తొలుత ఆలయంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే సత్యప్రభ



కలెక్టర్ షాన్ మోహన్‌కు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శుక్రవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆయనను కలసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారంపై వెంటనే స్పందించాలని కలెక్టర్‌ను ఆమె కోరారు. అలాగే కాకినాడ వచ్చిన పౌరసరాఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఎమ్మెల్యే సత్యప్రభ మర్యాదపూర్వకంగా కలిశారు.

వర్షాకాలం.. వ్యాధులు గాలం

- పట్టణంలో యథేచ్ఛగా సంచరిస్తున్న పందులు
- కొన్ని ప్రాంతాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన



తుని బ్యాంకు కాలనీలో సంచరిస్తున్న పందులు



పట్టణ శివారులో రోడ్డు పక్కన వేసిన ఖాళీ కొబ్బరి బొండాలు

తుని: వర్షాకాలం ప్రారంభమైంది. వాతావరణ మార్పులతో ఇప్పటికే నియోజకవర్గంలో డయేరియా కోరలు చాస్తోంది. పరిశుభ్రత పాటించకపోతే మరిన్ని వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

60 వేలకు పైగా జనాభా

తుని పట్టణం 7.02 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. సుమారు 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఇందులో ఏటా 20 వేల మంది పలు రకాల వ్యాధులకు గురవుతున్నారు. ఇందుకు పరోక్షంగా పందులు కారణమని అధికారులకు తెలుసు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య పందుల పెంపకం చేస్తున్నారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. పట్టణంలో 10 నుంచి 15 వేల వరకు పందులు ఉన్నాయి. వీటిలో సింహ భాగం పట్టణంలోని నివాస ప్రాంతాల్లో ఉన్నాయి. పందుల పెంపకందారులను అధికారులను సైతం ప్రభావితం చేస్తున్నారు. ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఎవరైనా తనిఖీలకు వస్తే భారీగా ముడుపులు ముట్టజెప్పడంతో అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రెండు నెలలకు ఒకసారి...

ఇటీవల ఏర్పడిన కొత్త ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన బృందంతో మున్సిపల్ అధికారులు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నారు. రెండు నెలలకు ఒకసారి పట్టణంలో పందులను పట్టుకుని తీసుకువెళ్తారు. ఇదంతా రికార్డుల్లో చూపించిన లెక్కలు మాత్రమే. పట్టణంలో ఎక్కడ చూసినా పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ప్రజారోగ్యశాఖలో దిగువ స్థాయి సిబ్బందికి పందుల పెంపకందారులతో సంబంధాలు ఉన్నాయి. దీంతో పందులు పట్టుకోవడానికి బృందాలు వస్తున్నాయనే సమాచారాన్ని ముందుగానే పెంపకం దారులకు చేరవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గుంతలతో ఇక్కట్లు

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగు నీటి గుంతలు ఉన్నాయి. ఈ గుంతల్లో మురుగుతో పాటు వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో దోమలు పెరిగిపోయి ప్రజల రోగాల బారిన పడుతున్నారు. దోమల వలన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాల యాజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం కానరావడం లేదు. ప్రజారోగ్యశాఖ అధికారులు దోమలకు ఆవాసా కేంద్రాలుగా ఉన్న గుంతల్లో గంబూషియా చేపపిల్లలను వేస్తున్నారు. ఇవి దోమల లార్వాను తినడం ద్వారా కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలో రోజువారీ వినియోగించే ఖాళీ కొబ్బరి బొండాలను శివారు ప్రాంతాల్లో రోడ్లపై వేస్తున్నారు. వీటిలోకి వర్షం నీరు చేరి దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా ఉన్నాయి. ప్రజలు పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. నివాస ప్రాంతాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ప్రజలు చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డంపర్ బిన్స్‌లో వ్యర్థాలను వేయాలి. రోడ్లపై వ్యర్థాలను వేయకుండా సహకరించాలి. రద్దీగా ఉండే రైతు బజారు, మార్కెట్ల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్నాం. దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేస్తున్నాం. ప్రజారోగ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

–శేఖర్,
శానిటరీ ఇన్‌స్పెక్టర్,
తుని

పింఛన్‌దారులపై విచారణ



కొత్తకొట్టాంలో పింఛనుదారులను విచారిస్తున్న ఎంపీడీఓ జయమాధవి

కోటనందూరు: మండలంలోని కొత్తకొట్టాం, ఎల్లీపేట గ్రామాల్లో సామాజిక పింఛనుదారులపై ఎంపీడీఓ జయమాధవి శుక్రవారం విచారణ చేపట్టారు. అర్హత లేని 111 మంది ప్రభుత్వం నుంచి పింఛను తీసుకుంటున్నారని కొత్తకొట్టాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కాకినాడలో డీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ జయమాధవి కొట్టాం గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. 111 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయమాధవి మాట్లాడుతూ విచారణ వివరాలు లిఖితపూర్వకంగా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవక ముందే టీడీపీ నేతలు విధ్వంసాన్ని మొదలు పెట్టారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ నాయకులు ఒక్క పింఛను కూడా తొలగించలేదన్నారు. టీడీపీ చోటా నాయకులు చేసే అరాచకాలను ఆ పార్టీ పెద్దలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దొగ్గా బాబులు, కొరుప్రోలు కృష్ణ, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఉద్యోగుల సర్దుబాటు



పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవికుమార్

తుని రూరల్: వచ్చే నెల 1న సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు గ్రామ సచివాలయాల ఉద్యోగులను సర్దుబాటు చేసినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు ఎక్కడ తక్కువ ఉన్నారు, ఎక్కడ ఎక్కువ ఉన్నారో గుర్తించారు. సచివాలయాల్లో అధినంగా ఉన్న ఉద్యోగులను తక్కువ ఉన్న గ్రామాలకు కేటాయిస్తూ ఎంపీడీఓ ఉత్తర్వులు ఇచ్చారు. మండలంలో 27 గ్రామ సచివాలయాలు ఉండగా 221 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో మండల వ్యాప్తంగా 12,405 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరందరికీ జూలై 1న రూ.8,32,98,000 పింఛన్ సొమ్ము అందించాల్సి ఉంది. ఉద్యోగులను సర్దుబాటు చేసి ఒక్కొక్క ఉద్యోగి 60 మంది లబ్ధిదారులకు పింఛన్ అందించాలని ఎంపీడీఓ రవికుమార్ ఆదేశించారు. ఇలా చేయడం వల్ల ఇతరశాఖల ఉద్యోగుల అవసరం లేదన్నారు.

పింఛన్ పంపిణీదారులకు శనివారం నగదును అందజేస్తామన్నారు. వలంటీర్ల నుంచి స్వాధీనం చేసుకున్న డివైజ్‌లను పింఛన్ అందించే ఉద్యోగులకు ఇచ్చామన్నారు. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెరిగిన పింఛన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలల ఏరియర్స్ కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున లబ్ధిదారులకు అందించనున్నట్టు చెప్పారు.

సత్యదేవుని దర్శించిన విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి



ఎస్పీ సుబ్బారెడ్డికి సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ (తూర్పుగోదావరి) సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

అతిసార నివారణకు ముందస్తు చర్యలు



ప్రత్తిపాడులో రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ సరిత

ప్రత్తిపాడు: గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పెద్దాపురం డివిజనల్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పి.సరిత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పంచాయతీ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ డయేరియా సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగుతో పాటు రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. డ్రైన్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్లు దెబ్బతింటే వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల మధ్య నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలు, జీఎల్‌ఆర్‌లను, డ్రైన్లు, రోడ్లను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఎస్.డేవిడ్ రాజ్, ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, రాచపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు ముష్టి పురుషోత్తం, దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 15 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ కుంకుమపూజలు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కోటనందూరులో వాటర్ ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

శంఖవరం: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి సూచించారు. మండలంలోని కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రపరిచిన దుస్తులను ధరించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

పరిశుభ్రత పాటించాలి

జగ్గంపేట: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, అతిసార రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. మండలంలోని రాజపూడిలో శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ అమ్మాజీ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి, బూసాల భద్రరావు, ఉప్పలపాటి బుల్లబ్బు, వేలిశెట్టి శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ సూచించారు. డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పంచాయతీ అధికారులు శుక్రవారం వాటర్‌ట్యాంకుల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. భీమవరపుకోట, కోటనందూరు, టీజే నగరం గ్రామాల్లో జరిగిన డ్రైడేను ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పరిశీలించారు. రెండు రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, వివిధ దశల్లో నీటిని పరీక్షించిన తరువాతే కుళాయిలకు విడుదల చేయాలని సూచించారు. పైపులైన్లలో లీకేజీలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజలు పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు.

తప్పుడు ప్రచారాలు చేయడం కాంగ్రెస్‌కు పరిపాటి



జగ్గంపేటలో మాట్లాడుతున్న బీజేపీ నేత కృష్ణ వర్మ

జగ్గంపేట: భారతీయ జనతా పార్టీపై తప్పుడు ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు పరిపాటిగా మారిందని బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల కృష్ణ వర్మ అన్నారు. జగ్గంపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని, ముస్లిం రిజర్వేషన్లు ఆపేస్తారని, రాజ్యాంగ మార్పు తప్పదని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ఆరోపించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ సమయంలో బీజేపీ నేతలను జైలుపాటు చేసి నానా ఇబ్బందులు పెట్టారని, ఎంతో మంది చనిపోయారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలను ట్యాంపర్ చేశారని ఆరోపించడం దారుణమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు మేడిశెట్టి వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు కొత్త శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ప్రస్తావనలో తప్పేముంది

ప్రత్తిపాడు: పార్లమెంట్ తొలి సెషన్ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎమర్జెన్సీని ప్రస్తావించడంలో తప్పేముందని కాకినాడ జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు పైడా భవనప్రసాద్ ప్రశ్నించారు. ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలో 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రాజ్యాంగ విరుద్ధంగా ఎమర్జెన్సీని విధించారన్నారు. బీజేపీ నాయకులు జయప్రకాష్ నారాయణ్, వాజ్‌పేయి, అద్వానీ, జార్జి పెర్నాండేజ్, రాజ్‌నారాయణ వంటి నాయకులతో పాటు ఎమర్జెన్సీని వ్యతిరేకించిన వారందరినీ జైల్లో పెట్టించారన్నారు. ఎమర్జెన్సీ గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, హిందూ ధర్మరక్షా సమితి నాయకుడు కర్రి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

గండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తాగునీటి పరీక్షలు నిర్వహించారు. నీలాద్రిరావుపేట, పి నాయకంపల్లి, మురారి తదితర గ్రామాల్లో తాగునీటికి పరీక్షలు చేసి క్లోరినేషన్ శాతాన్ని గుర్తించినట్టు ఈఓపీఆర్డీ వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

రహదారులపైనే వర్షపు నీరు



ఆర్టీసీ కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపునీరు

ఏలేశ్వరం: వర్షం పడితే పట్టణంలోని పలు రహదారులపై నీరు నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షం పడినా రహదారులపై నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై కురిసిన వర్షపునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో రోడ్లపైనే నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు షిర్డీ నగర్, లింగవరం కాలనీ, చైతన్యనగర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలు సాగించేందుకు మహిళలు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను మిగిలిన సీట్లలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్‌ఆర్‌ఆర్ కృష్ణన్ శుక్రవారం తెలిపారు. ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, ట్రేడ్ విభాగాల్లో సీట్లు ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు జూలై 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న ప్రింట్ కాపీతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐకి వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే దరఖాస్తులు చెల్లుబాటు కావన్నారు. మరిన్ని వివరాలకు 94402 62266, 94926 62962 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కౌలు కార్డులతో బహుళ ప్రయోజనాలు



వి.కొత్తూరులో రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: కౌలు కార్డులతో సాగుదారులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎస్.చామవరం, వి.కొత్తూరు గ్రామాల్లో సీసీఆర్‌సీ కార్డుల ఉపయోగాలపై వీఏఏల ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూ యజమానులకు నష్టం లేకుండా కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పంట రుణాలు, పంటల బీమా, పంట విక్రయం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారం అందాలంటే రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు బంగారాజు, గాయత్రి, రాజేష్, శైలజా, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు



తోటపల్లిలో ఎంపీపీ స్కూల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు సూచించారు. మండలంలోని తోటపల్లి ఎంపీపీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని 34 రకాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రశ్నలు సంధించి విద్యార్థుల్లో ప్రగతిని అంచనా వేశారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంధ్యం అప్పలరాజు, సీఆర్పీ రాంజీ ప్రసాద్, సత్యవతి, సత్తిబాబు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

కిర్లంపూడి: స్థానిక విజ్ఞాన భారతి ప్రైవేట్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రౌండ్ టేబుల్ ఇండియా–77, వైజాగ్ లేడీస్ సర్కిల్ ఇండియా–201 ఆర్థిక సాయంతో చేపట్టిన తరగతి గదుల నిర్మాణ పనులను సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా బీవీకే జాయింట్ సెక్రటరీ రాపర్తి సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ విద్యా కేంద్రం 65 ఏళ్లుగా గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి రౌండ్ టేబుల్ ఇండియా తరగతి గదుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తేజ ముత్యం, ప్రతీక్ సింగ్, రమణమూర్తి, బి.సూర్యనారాయణ, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం

తొండంగి: స్థానిక అక్షర పబ్లిక్‌స్కూల్ విద్యార్థులకు తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నగదు బహుమతులు ప్రదానం చేశారు. టెన్త్ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కెఎస్ఎల్ఎస్ వర్మ నగదు బహుమతులను అందజేశారు.

అలాగే సి.రాజగోపాలచారి రచించిన రామాయణం పుస్తకాలను క్లబ్‌సభ్యుడు పోన్నాడ శ్రీనివాస్ పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, ఎస్.వీర్రాజు, డాక్టర్ పి.ప్రసాద్, ఎం.వివేకానంద్, జి.రామకృష్ణ, పోన్నాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.